విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నాం


సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్

అబిడ్స్: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే సెయింట్ జార్జెస్ స్కూల్స్ ఉద్దేశమని మెదక్ ఇన్‌చార్జి బిషప్ డయోసిస్ రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్ పేర్కొన్నారు. అబిడ్స్ గ్రామర్ స్కూల్స్ ఆవరణలో ఆ విద్యాసంస్థల 190 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్ హాజరై మాట్లాడుతూ..తమ విద్యా సంస్థల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఉత్తమ శిఖరాలను అధిరోహించారన్నారు. సరోజినీనాయుడుతో పాటు పలువురు ప్రముఖులు విద్యను అభ్యసించిన తమ విద్యాసంస్థల 190 ఏళ్ల వేడుకలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

సావనీర్, కేలండర్ ఆవిష్కరణ..

190 ఏళ్ల సావనీర్‌తో పాటు మెదక్ చర్చి 2025వ సంవత్సరం కేలండర్‌ను రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్, రేవ్ డాక్టర్ కె.ప్రైసిల్లా పర్విల్లా రియోబిన్ మార్క్, రేవ్ డాక్టర్ పి.సోలామాన్ రాజ్, జి.ఈబర్ జయపాల్, జాన్ జనార్దన్, ఉదయ్‌కుమార్, మంత్రి సాలమాన్ రాజ్, జి.ప్రభుకిరణ్, జయానంద్, మినిస్టర్లతో పాటు పలువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రిన్సిపాల్స్ బి.రూత్ లజ్వంతి, వార్డెన్, కరస్పాండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్లు ఘనంగా సత్కరించి విద్యాసంస్థల ప్రగతిని వెల్లడించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముందుగా రేవ్ డాక్టర్ ప్రెస్కిల్లా పర్విల్లా రూబెన్ మార్క్, మెదక్ డయాసిస్ మొదటి మహిళ జ్యోతి ప్రజ్వలన చేసి 190 ఏళ్ల సంబరాల వేడుకలు ప్రారంభించారు.

ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేయాలి


కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ

నాంపల్లి: ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేయాలని తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ మాట్లాడుతూ..ప్రభుత్వ కార్యాలయాల్లో ఉర్దూ భాషలో సూచిక బోర్డులు లేవని అన్నారు. ఇంగ్లిష్, తెలుగు భాషతో పాటుగా ఉర్దూకు కూడా తగు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషను రెండో అధికార భాషగా ప్రకటించారే తప్ప అమలు జరుగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే డిసెంబరు 10న అత్తాపూర్ మత్స్య భవన్ ఎదుట జరిగే ఉర్దూ సదస్సుకు హాజరై ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఫసీవుల్లా, ఖైసర్ హజీరా తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్

గోల్కొండ: రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ హైదరాబాద్ జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆసుపత్రి నగరంలోని ఏరియా ఆసుపత్రుల్లో అగ్రస్థానంలో నిలుస్తూ కేంద్రప్రభుత్వం అందించే కాయా కల్ప్ అవార్డులను వరుసగా గెలుస్తుందన్నారు. వైద్య బృందం, నర్సింగ్ బృందం సమన్వయం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరత లేదని అవసరమైతే ఆసుపత్రి సూపరింటెండెంట్ అభ్యర్థన మేరకు అదనపు సిబ్బందిని పంపేందుకు ఉన్నతాధికారులను కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుహాసిని, ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ ఎస్.సాధన, సివిల్ సర్జన్ డాక్టర్ కౌసర్ అస్రా, నర్సింగ్ హెడ్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడపడుచులకు వరం


లబ్ధిదారురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడ పడుచులకు వరమని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బండ్లగూడ మండల పరిధిలోని 461 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఆయన ఫాతిమా కళాశాలలో చెక్కులను తహసీల్దార్ రాధికతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసకుంటున్నామన్నారు. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 31,178 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షబానా హఫీజ్ పటేల్, సలీం బేగ్, ఫహద్ బిన్ అబ్దాద్, రహెమాన్, వాహబ్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ



గోల్కొండ: విద్యార్థుల్లో సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించడం ఎంతో ప్రయోజనకరమని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంద్రప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యంశాలతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్తగా వస్తున్న పరిశోధనలను కూడా వివరించడం అత్యుత్తమమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య మెహిదీపట్నం ఏజీఎం కృష్ణ, ప్రిన్సిపాల్ స్వామి, ఆర్.ఏ.హరికృష్ణ, జోనల్ కో ఆర్డినేటర్ మల్లేష్, ఇన్‌చార్జీలు నదీమ్, బాలరాజ్ తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన

అఫ్జల్‌గంజ్: విద్యార్థులకు ఆయుర్వేద చ్యవాన్‌ప్రాష్ ఆరోగ్యవంతంగా ఉండే విధంగా పాటుపడుతుందని ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ పరమేశ్వర్ అరోరా పేర్కొన్నారు. పురాతనమైన ఆయుర్వేద పదార్థాలు మనిషి ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయన్నారు. శుక్రవారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థులకు డాబర్ ఇండియా ఆధ్వర్యంలో ఆయుర్వేద చ్యవాన్‌ప్రాష్ ఉచితంగా పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరమేశ్వర్ అరోరా, జీఎం అమిత్‌గర్గ్ ఆయుర్వేదం గురించి వివరించారు.



జీఎన్ఐటీఎస్‌లో రక్తదాన శిబిరం



గోల్కొండ: తమ కళాశాలలో చదువుకునే విద్యార్థులు సమాజ సేవకు ఎప్పుడూ ముందుంటారని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జూబ్లిహిల్స్ సౌజన్యంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటే కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరం తదితర సేవా కార్యక్రమల్లో తమ విద్యార్థినులు ఉత్సాహంగా ముందుకు వచ్చి సేవలు అందిస్తారన్నారు. లయన్స్ క్లబ్ జూబ్లిహిల్స్ అధ్యక్షుడు జి.ధర్మేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఎన్ఐటీఎస్‌లో జరిగే రక్తదాన శిబిరాలకు ఎప్పుడూ మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి అనురాధా, శ్రీ రత్నం, డాక్టర్ రాంమోహన్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమశ్రీ, కోఆర్డినేటర్ నీలి రమేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులున్నారు.

దీక్షా దివస్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


ప్రదర్శనలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియా గుప్తా తదితరులు


ధూల్‌పేట్ నుంచి భారీ ర్యాలీ


తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా


లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద.. బీఆర్‌ఎస్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి తదితరులు


దీక్షా దివస్‌కు వెళ్లిన కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిషోర్‌కుమార్ తదితరులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేంద్ర మంత్రి పదవిని ఎదురించి ఉద్యమించిన మహా నాయకుడు కేసీఆర్ అని బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గం నాయకుడు టి.జీవన్ సింగ్ అన్నారు. శుక్రవారం దీక్ష దివాస్‌ను పురస్కరించుకోని గుడిమల్కాపూర్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల భాస్కర్ తదితరులున్నారు. అదే విధంగా లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి వేడుకలు నిర్వహించారు.


కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్‌సింగ్ తదితరులు


ర్యాలీలో నాంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు

గోషామహల్ నుంచి..

అఫ్జల్‌గంజ్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజాభ్యున్నతి సాధ్యమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ దీక్షా దివస్ సందర్భంగా గోషామహల్ నుంచి బీఆర్‌ఎస్ భవన్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రియాగుప్తా, విజయ్ ముధిరాజ్, లత, మహేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, సురేష్, సునిల్, సాయి ముదిరాజ్ పాల్గొన్నారు.

ధూల్‌పేట్ నుంచి..

ధూల్‌పేట్ నుంచి గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షా దివస్ వేడుకలకు బీఆర్‌ఎస్ భవన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో బీఆర్‌ఎస్ నేతలు మనోహర్ గైక్వాడ్, శ్రీనివాస్, శ్రీశైలం, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌కుమార్, రాజు, హెచ్.కుమార్ ధినేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో..

జియాగూడ: తెలంగాణ భవన్‌లోని దీక్షా దివస్ వేడుకలకు బీఆర్‌ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సీనియర్ నాయకులు జడల మోహన్, దేవేందర్ సాగర్, చంద్రకాంత్, రఘునాథ్, సి.బాబూ, హేమంత్‌రాజ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో..

నాంపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ భవన్‌లో జరిగే దీక్షా దివస్‌కు నాంపల్లి నియోజకవర్గం నేతలు తరలివెళ్లారు. నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో కార్యకర్తలు, నేతలు భారీ బైక్ ర్యాలీని చేపట్టారు. అన్ని డివిజన్లలో ర్యాలీని పూర్తి చేసుకుని బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ భవన్‌కు చేరుకున్నారు.

వికలాంగుల సంక్షేమమే ధ్యేయం




సుల్తాన్‌బజార్: వికలాంగుల సంక్షేమమే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తుందని డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు అన్నారు. బొండాడ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాఘవేంద్రరావు 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని నారాయణ సేవా సంస్థన్ 25 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా వికలాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సందీప్, ప్రదీప్, గుండాల జ్యోతి, రితేష్ జాగిర్దార్, సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ సీనియర్ ఉద్యోగి మృతి


రాజేందర్ (ఫైల్)

నాంపల్లి: ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) సీనియర్ ఉద్యోగి రాజేందర్(58) శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. 33 ఏళ్లుగా ఆయన ఫెడరేషన్ హౌస్‌కు అటెండర్ హోదాలో సేవలందించారు. రాజేందర్‌నగర్‌లో నివాసం ఉండే రాజేందర్‌కు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. రాజేందర్ మృతి పట్ల ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం


అంజద్

సంతోష్‌నగర్: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ అంజద్ ఖాన్ (45) పుట్టుకతో మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా అంజద్ ఖాన్ ఈ నెల 28న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదం

డబీర్‌పురా: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్రు షెహవర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బాసలమ రెసిడెన్సిలో గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఫ్లాట్ నంబర్ 101లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి మంటలు చెలరేగాయి. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న మొఘల్‌పురా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టం, గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ


యశ్వంత్ గురుస్వామి

గౌలిపురా: గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి 18వ మహా పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డి.యశ్వంత్ గురుస్వామి తెలిపారు. ఉదయం 4 గంటలకు గణపతి హోమం, 9 గంటలకు అభిషేకం, 12.30 గంటలకు పడి హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18 ఏళ్లుగా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తున్నట్లు..ఈసారితో నాలుగుసార్లు విజయవంతంగా శబరిమలైకు పాదయాత్రను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పూజా కార్యక్రమంలో స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

తుర్కిస్‌తో హైదరాబాద్‌కు చారిత్రక స్నేహ సంబంధాలు


మక్దూం బ్రదర్స్‌లో షేర్వానీ షాపింగ్ చేస్తున్న తుర్కిస్ కాన్సులేట్ జనరల్, అంబాసిడర్

చార్మినార్: తమ దేశంతో హైదరాబాద్ నగరానికి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని తుర్కిస్ కాన్సులేట్ జనరల్ ఓర్హన్ యల్మాన్ ఒకాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఇండియా, నేపాల్, భూటాన్‌లకు చెందిన తుర్కిస్ అంబాసిడర్ ఫిరట్ సునెల్‌తో కలిసి ఆయన పాతబస్తీని సందర్శించి సందడి చేశారు. మదీనా సర్కిల్లోని మక్దూం బ్రదర్స్‌లో షాపింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..చారిత్రక కట్టడాలకు పాతబస్తీ నిలయమన్నారు. మక్దూం బ్రదర్స్‌లో షేర్వానీలకు ఎంతో డిమాండ్ ఉందనే విషయం తమకు తెలుసునన్నారు. అంతేకాకుండా ఇక్కడ ఎంతో మంది మంత్రులు, క్రికెట్ క్రీడాకారులు షాపింగ్ చేసి షేర్వానీలు కొనడం జరిగిందని విషయం మక్దూం బ్రదర్స్ యజమాని ఆబెద్ మోహీనుద్దీన్ తెలియజేశారన్నారు. భారతదేశంలో తమ దేశానికి స్నేహ సంబంధాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇరు దేశాల ప్రజలు శాంతి సామరస్యంతో ఇలాగే కలిసి మెలిసి ఉండాలని కోరుకుంటున్నామన్నారు.

ఘనంగా రైతు పండుగ ఉత్సవాలు


అపెక్స్ బ్యాంక్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తుందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రైతు పండుగ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటీవ్ అపెక్స్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సహకార బ్యాంక్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, మెలకులవలపై అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


ఆపరేషన్ రోప్‌వేలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్, సిబ్బంది

యాకుత్‌పురా: నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఆపరేషన్ రోప్‌వే నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్టేషన్ పరిధిలోని బీబీ బజార్ చౌరస్తా నుంచి పురానీహవేలీ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఆపరేషన్ రోప్‌వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మూడు రోజులుగా ఆపరేషన్ రోప్‌వే చేపడుతున్నామన్నారు. వాహనల రద్దీతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ కావడంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుమన్నారు. ఈ డ్రైవ్‌లో ఎస్సై నాగూర్ పాషా, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

టోలిచౌకి చౌరస్తాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం


టోలిచౌకి చౌరస్తా వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: టోలిచౌకి చౌరస్తాను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి చౌరస్తా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జరుగుతున్న బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులు, రోడ్డు పనులు పూర్తి అయిన వెంటనే టోలిచౌకీ ఫ్లై ఓవర్ సుందరీకరణ పనులు చేపడతామన్నారు. టోలిచౌకి ఫ్లై ఓవర్ పిల్లర్లపై అందమైన చిత్రాలు వేసే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ విషయంపై బల్దియా కమిషనర్‌ను కలిసి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

45 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అల్పాహారం



జియాగూడ: రహీంపురా సత్తెన్న గల్లీ కాగజ్‌నగర్‌లోని శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయంలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు 45 రోజుల పాటు అల్పాహారం అందిస్తామని అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు గొడిశాల నరేష్ గౌడ్, కె.మోహన్ గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రతిరోజూ రాత్రి 8 నుంచి 10:30 గంటల వరకు అల్పాహారం తీసుకోవచ్చన్నారు.

ప్రజా సమస్య పరిష్కారానికి కృషి


ప్రజలతో సమావేశమైన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: ప్రజా సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. నియోజకవర్గంలోని తలాబ్‌చంచలం డివిజన్ ఖాన్‌నగర్, భవానీనగర్, తలాబ్‌కట్టా బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలకు సేవలందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే సామాజిక సేవా అలవర్చుకోవాలి


అంధులకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయి నుంచే సామాజిక సేవా అలవర్చుకోవాలని విద్యావేత్తలు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'థ్యాంక్స్ గివింగ్ డే'ను పురస్కరించుకొని శుక్రవారం విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాల విద్యార్థులు మాసబ్‌ట్యాంక్‌లోని బ్లయిండ్ హాస్టల్, వయోవృద్ధుల ఆశ్రమం, విజయనగర్‌కాలనీ బాలికా నిలయం హాస్టల్‌కు వెళ్లి పండ్లు, దుస్తులు, స్నాక్స్, ఆహారపదార్థాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఈ-కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బస్తీ సమస్యలను పరిష్కరించండి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బోయిని విజయ్ కుమార్

చార్మినార్: బస్తీ సమస్యలను పరిష్కరించాలని అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్, సీనియర్ బీజేపీ నాయకుడు బోయిని విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. జంగంమెట్ డివిజన్, నాగులబండలోని అంబేద్కర్ నగర్‌లో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

సత్తా చాటిన పారా క్రీడాకారులు



గన్‌ఫౌండ్రీ: మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న యుటీటీ పారా టేబుల్ టెన్నిస్ జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల విభాగంలో నిషా కుమారి, విజయదీపిక ఫైనల్ పోటీలలు విజయాన్ని సాధించి అద్భుత ప్రతిభను కనబరిచారు. పురుషుల విభాగంలో హితేష్ ఫైనల్ పోటీలలో తన సత్తా చాటారు. రాబోయే రోజుల్లో పారా క్రీడాకారులు మరిన్ని విజయాలను సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

'విద్యార్థుల భవిష్యత్‌ను సర్వనాశం చేసిన బీఆర్‌ఎస్'


గౌరీ సతీష్

అబిడ్స్: విద్యార్థుల భవిష్యత్తును పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్లపాటు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల హాస్టళ్లను కానీ, వారి బాగోగులను కానీ ఏనాడు చూడలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థుల కోసం నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంటుంటే బీఆర్‌ఎస్ అగ్ర నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్



జియాగూడ: ఎస్టీ గురుకులాల్లో కలుషితమైన ఆహారం తిని నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బీజేపీ నాయకులు విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు తెలుగు సంక్షేమ భవన్ ముట్టడికి పిలుపునివ్వగా ముందు జాగ్రత్త చర్యగా కుల్సుంపురా పోలీసులు కార్వాన్, జియాగూడ, తదితర ప్రాంతాల్లో ఉంటున్న బీజేపీ నాయకులను ఉదయం వారి నివాసాల వద్దనే అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల అనంత కృష్ణ, కార్యవర్గ సభ్యులు గూడుమని చంద్రకాంత్, గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాజేందర్ డేగన్, ఉపాధ్యక్షులు ముచింతల సత్యనారాయణ, ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్, కార్యవర్గ సభ్యులు గంజి రఘునాథ్, తైలం సందీప్ సాగర్ ఉన్నారు.